పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నం

ఎంజీఎం దవాఖానకు తరలించిన పోలీసులు

భూక్య రమేశ్

చిల్పూరు, మార్చి 7 : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపల్లి శివారు దేవోజీతండాకు చెందిన భూక్య రమేశ్ భార్యను గతంలో హత్య చేసి జైలుకెళ్లి వచ్చాడు. ఆతర్వాత ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె తరపు బంధువులు రమేశ్‌ను పట్టుకొని శుక్రవారం అబ్దుల్‌నాగారంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేశారు. ఆమె పేర రెండు ఎకరాల భూమి చేయడం లేదా రూ.60లక్షల నగదైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రమేశ్ రూ.30లక్షలు ఇస్తానని చెప్పాడు. కానీ వారు అంగీకరించకుండా ఇవ్వాల్సిందేనని డిమాం డ్ చేశారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అతడు మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయగా ఎస్సై వెంటనే స్పందించి 108కు సమాచారం అందించి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. సకాలంలో స్పందించి అతడి దవాఖానకు తరలించి ఎస్సై మానవత్వం చాటుకున్నారు.

నాయకత్వ నైపుణ్యాలు పెంచుకోవాలి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ చౌరస్తా, మార్చి 7: యువత నాయకత్వ నైపుణ్యాలను పెంచుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్యతో కలిసి అదనపు కలెక్టర్ 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువత 2047లోగా రాజకీయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండేందుకు వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొని వివిధ రకాల సమస్యలపై తమ ఆలోచనలు, అభిప్రాయాలు వెలువరించాలన్నారు. జిల్లాలోని యువకులు మార్చి 9వ తేదీలోగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ వెబ్‌పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏబీవీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అనగాని శ్రీనివాస్, నవీనారాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

పాలకుర్తి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పెండింగ్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వంట గది ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలన్నారు. ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ పీ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆవుల రాములు, ఆర్ఐ రాకేశ్, పిన్సిపాల్ ఎస్ స్వరూప ఉన్నారు.

అంగన్‌వాడీలకు చిన్నసైజు కోడిగుడ్లు సరఫరా

- 45 నుంచి 50 గ్రాములు ఉండాలనే నిబంధన పాటించని కాట్రాక్టర్
- పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహారం లోపించే ప్రమాదం

జిల్లా కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన చిన్నసైజు కోడిగుడ్లు

జనగామ చౌరస్తా, మార్చి 7: జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం చిన్న సైజు కోడిగుడ్లు సరఫరా అయ్యాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందకుండాపోతోంది. అంగన్‌వాడీలకు వచ్చే వారికి బాలామృతం, అన్నం, పప్పు దినుసులు, పాలతోపాటు కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహారాన్ని నిర్వాహకులు అందించాలి. ప్రోటీన్, విటమిన్ ఏ, డీ, ఈ, బీ12తోపాటు ఐరన్, జింక్, సెలీనియం వంటి పోషకాలు అధికంగా ఉండే కోడిగుడ్లను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించేందుకు 45గ్రాముల నుంచి 50 గ్రాములలోపు ఉన్న కోడిగుడ్లను పంపిణీ చేయాలనే నిబంధనలు ఉన్నాయి. కోడిగుడ్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.4.50 చొప్పున చెల్లిస్తుంది. కానీ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సదరు కాంట్రాక్టర్ చిన్న సైజు కోడిగుడ్లు సరఫరా చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి కోడిగుడ్లు తినడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం లోపిస్తుంది. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి నెలకు రెండు నుంచి మూడు విడతల్లో కోడిగుడ్లు సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్ కొన్నిసార్లు రెండు విడతల్లో మాత్రమే పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం సరఫరా చేసిన చిన్నసైజు కోడిగుడ్లను పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తీసుకోవడానికి నిరాకరించారు. అంగన్‌వాడీలకు ఇలాంటి కోడిగుడ్ల సరఫరాపై కలెక్టర్ వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం హామీలు నెరవేర్చాకే స్టేషన్‌ఘన్‌పూర్‌లో అడుగు పెట్టాలి

ఎస్ఎఫ్ఐ నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 7 : ఎన్నికల్లో రైతులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చిన తర్వాతే స్టేషన్‌ఘన్‌పూర్ గడ్డ మీద అడుగు పెట్టాలని, లేకుంటే సీఎం పర్యటనను అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకన్న రాథోడ్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించలేదని తెలిపారు. ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని, నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకుండా నిరుపేద విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పగా, ఇప్పుడు పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలు, సాగునీటి సమస్యను పరిష్కరించాకే ఇక్కడ అడుగు పెట్టాలని, లేకుంటే ఈనెల 16న సీఎం పర్యటనను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. ఆర్య, విగ్నేష్, సుమ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకన్న రాథోడ్

కార్యకర్తలను కాపాడుకుంటా

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

కొడకండ్ల: బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల/దేవరుప్పుల, మార్చి 7: నియోజకవర్గ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కొడకండ్ల మండలం మొండ్రాయిలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దొపాటి ఎల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా శుక్రవారం వెళ్లి పరామర్శించారు. గిర్నితండాలో ధరావత్ లక్ష్మి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ మొండ్రాయి గ్రామ సీనియర్ కార్యకర్త ననుబాల మల్లయ్య – మరియమ్మ దంపతుల కుమార్తె మానస – మధుకర్ వివాహ రిసెప్షన్‌కు హాజరై వధువరులను ఆశీర్వదించారు. కాగా, దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌లో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ దావుల వెంకన్న – విజయ దంపతుల కుమారుడు గగేష్–శరణ్య వివాహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరై ఆశీర్వదించి కానుకలు అందజేశారు. జీసీసీ మాజీ చైర్మన్ అభిమాన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ పార్టీ కొడకండ్ల మండల అధ్యక్షుడు సింధే రామోజీ, మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము, దీకొండ వెంకటేశ్వర్ రావు, బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ దేశగాని సతీష్, బొబ్బిలి కనకయ్య, దేవరుప్పుల మండల అధ్యక్షుడు తీగల దయాకర్, ప్రధానకార్యదర్శి చింత రవి, నెల్లుట్ల రత్నాకర్‌రావు, మాజీ సర్పంచ్ వర్రె మధుయాదవ్, గ్రామ మాజీ అధ్యక్షుడు బస్వ సోమనర్సయ్య, గొల్లపల్లి గ్రామ అధ్యక్షుడు తీగల సత్యనారాయణ ఉన్నారు.

పొద్దాటి కల్లు మస్తు మజాగుంది!

దేవరుప్పుల: మండలంలోని మన్‌పహాడ్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు గ్రామంలోని గీత కార్మికుడు, తెలంగాణ ఉద్యమకారుడు కోల సోమన్న పొద్దాటి కల్లు తాగించాడు. అప్పుడే కల్లుగీసి తీసుకొస్తున్నండగా ఎర్రబెల్లి తారసపడగా కల్లు తాగాలని కోరాడు. దీంతో ఎర్రబెల్లి తాటికమ్మ చేతబట్టి కల్లుతాగారు. కల్లు మస్తు మజాగుందన్నారు.

మన్‌పహాడ్‌లో కల్లు తాగుతున్న ఎర్రబెల్లి

జనగామ జిల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలి

అభివాదం చేస్తున్న గౌడ ఐక్య సాధన సమితి నాయకులు

పాలకుర్తి/కొడకండ్ల, మార్చి 7: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన దీక్షకు ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలు పాలకుర్తి, కొడకండ్లలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ట్యాంక్ బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ కులస్తుల రిజర్వేషన్లను 25శాతానికి పెంచాలన్నారు. జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట చేపట్టే దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ సర్వాయి పాపన్న జిల్లా ప్రకటనతోపాటు తెలంగాణ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయాలని కోరారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి పులి గణేశ్ గౌడ్ అధ్యక్షతన, గౌడ ఐక్య సాధన సమితీ రాష్ట్ర కార్యదర్శి పొడిశెట్టి వెంకన్న, జిల్లా అధ్యక్షుడు తండా రమేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధి బూడిద నర్సయ్య, తాళ్ల సోమనారాయణ, నలమాస రమేశ్, నీళ్ల లింగస్వామి, కమ్మగాని పర్శరాములు, బండి కొండయ్య, పులి ప్రభాకర్, కమ్మగాని రాంచంద్రం, దేశగాని శ్రీశైలం గౌడ్, కప్పల శ్రీను, ఎలికట్టే కిషన్, బొమ్మగాని వెంకటేశ్వర్లుగౌడ్, గిరగాని యాకన్న గౌడ్, బొమ్మగాని వీరయ్య, శివమూర్తి, పనస చంద్రమౌళి, దూపాటి వెంకన్న, దేశగాని చిన్న సోమయ్య పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

జనగామ చౌరస్తా, మార్చి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని (మార్చి 8) పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్ వంటి ఆటల్లో మహిళా ఉద్యోగులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ప్రతిభకనబరిచిన ఉద్యోగులకు ఈనెల 10వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి డీ ఫ్లోరెన్స్ తెలిపారు. డీఆర్‌డీఏ డీపీఎం వినీతరెడ్డి పాల్గొన్నారు.

లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో మహిళా ఉద్యోగులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

జనగామ చౌరస్తా, మార్చి 7 : జగిత్యాల జిల్లాలో దళిత ఆశా వర్కర్‌పై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో ఐద్వా, సీఐటీయూతోపాటు పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య మాట్లాడుతూ లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి షబానా, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలి

- ఎమ్మెల్యే కడియంకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టినందుకే బీఆర్ఎస్ నాయకుడిని చితకబాదిన పోలీసులు
- జన సేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పృథ్వీ

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 7 : ధర్మసాగర్ మండలం జానకీపురానికి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కుర్సపల్లి రమేశ్‌ను చితకబాది అధికార దుర్వినియోగానికి పాల్పడిన సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలని జనసేన పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె పృథ్వీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుర్సపల్లి రమేశ్ సోషల్ మీడియాలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడని తెలిపారు. అదే గ్రామానికి చెందిన రాజిరెడ్డి ఫిర్యాదు చేయగా పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడి రమేశ్‌ను చితకబాదారని పేర్కొన్నారు. పోలీసులు ఎమ్మెల్యేకు ఊడిగం చేయాలనుకుంటే ఉద్యోగాలకు రాజీనామా చేయాలన్నారు. పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా మారి విచక్షణ రహితంగా చితకబాదడం దారుణమన్నారు. నిందితుడిపై కేసు పెట్టి రిమాండ్‌కు పంపే వరకే పోలీసుల బాధ్యత అని, కుటుంబాన్ని దుర్భాషలాడుతూ, బాధితుడిపై దాడి చేసే అధికారం పోలీసులకు లేదని, ఈ ఘటనకు పాల్పడిన సీఐ, ఎస్సైలను వెంటనే సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

జనగామ రూరల్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జీపీ సిబ్బంది


దేవరుప్పుల: ఎంపీవో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న జీపీ సిబ్బంది

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా

జనగామ రూరల్/ దేవరుప్పుల/ బచ్చన్నపేట/ కొడకండ్ల, మార్చి 7: పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. జనగామ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు చారి మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి జీపీ కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్‌సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలని, జీవో 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాత కేటగిరీలన్నీ కొనసాగించాలన్నారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీదని బాల్‌నర్సయ్య, వినయ్‌కుమార్, నరేష్, వంశీధర్, శ్రీకాంత్, సిద్దులు, ప్రభాకర్, అయిలయ్య, నాగయ్య, ఎల్లయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

దేవరుప్పులలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బస్వ రాంచందర్, సంగి కర్ణాకర్ నేతృత్వంలో ఎంపీవో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం జీపీ ఉద్యోగులను శ్రమను గుర్తించాలన్నారు. జీపీ సిబ్బంది రమేశ్, వెంకన్న, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, పరశురాములు, సంజీవ, సైదులు, ఐలయ్య, ఉప్పలయ్య, కరుణ, జయమ్మ, అశోక్, లావణ్య ఉన్నారు.

బచ్చన్నపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాలో జీపీ ఉద్యోగు సంఘం జిల్లా నాయకులు కొమురెల్లి శ్రీనివాస్, టేకులపల్లి రాజు, ముశిని బాబుగౌడ్, ముక్క నాగయ్య, గుజ్జుక శ్రీనివాస్, వనం చంద్రశేఖర్ మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలన్నారు. కారోబార్లు నాగయ్య, శ్రీనివాస్, మల్లయ్య, కిష్టయ్య, లలిత, శ్యామల, ఆంజయ్య, మహేందర్, శ్రీనివాస్, రమేశ్, గోపాల్, సాయిబాబా, సోమయ్య పాల్గొన్నారు.

కొడకండ్లలో ఎంపీడీఓ నాగశేషాద్రికి వినతిపత్రం అందజేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో కార్మికుల భద్రత కోసం ఒక్క పూట పని చేయించాలని కోరారు. జీపీ కార్మికులు ఎస్.శ్రీనివాసాచారీ, ఎన్ యాకయ్య, ఎస్ వెంకన్న, టీ కుమారస్వామి, ఎం వెంకన్న, పీ రమేశ్, డీశ్రీను పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ బాధ్యులు

జనగామ చౌరస్తా, మార్చి 7: జనగామ పోర్ట్ పోలియో హైకోర్టు జడ్జి జూకంటి అనిల్‌కుమార్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని పాలకుర్తి, కొడకండ్ల మండలాలను జనగామ కోర్టు పరిధిలోకి మార్చాలని వినతిపత్రం సమర్పించారు. కోర్టు ఆవరణలో క్యాంటీన్, జిరాక్స్, పార్కింగ్ వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి, సీనియర్ అడ్వకేట్స్ భిక్షపతి, శ్రీరాం శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, హరిప్రసాద్, కే శ్రీనివాసులు, మంచాల రవీందర్, కోట శంకర్ పాల్గొన్నారు.

పదో తరగతి హాల్ టికెట్స్ విడుదల

జనగామ చౌరస్తా, మార్చి 7: ఈ విద్యా సంవత్సరం 2024–25 పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్స్ శుక్రవారం విడుదల చేసినట్లు డీఈవో ఎం.రమేశ్ తెలిపారు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ https//bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చిల్పూరు, మార్చి 7 : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన ఘటన మండలంలోని చిన్నపెండ్యాలలో శుక్రవారం జరిగింది. కొన్నె రాములుకు చెందిన పాడిగేదె రోజూ మాదిరిగానే పాలు పిండి, మేత కోసం చెలకలో కట్టేశాడు. తిరిగి వచ్చి బర్రెకు నీళ్లు పెడదామని చూడగా మృత్యువాత పడింది. గడ్డి మేసే క్రమంలో తెగి పడి ఉన్న కరెంట్ వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. రూ.80వేల వరకు నష్టపోయినట్లు వాపోయాడు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన అశ్వరావుపల్లి విద్యార్థి

వెంకటేశ్

రఘునాథపల్లి, మార్చి 7 : మండలంలోని అశ్వరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎల్లందుల వెంకటేశ్, 2024–25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక ఈ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వెంకటేశ్‌ను ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ బాధ్యులు అభినందించారు.

ఒలింపియాడ్‌లో 'సెయింట్ పాల్స్' విద్యార్థుల ప్రతిభ

బహుమతి అందుకున్న విద్యార్థి వర్షిత్

జనగామ చౌరస్తా, మార్చి 7: ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో జనగామ పట్టణంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు శుక్రవారం ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్ తెలిపారు. మ్యాథ్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ విజేతగా 8వ తరగతి విద్యార్థి బీ వర్షిత్ గెలుపొందినట్లు పేర్కొన్నారు. కాగా, ఇటీవల నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని భానుప్రియ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో మూడో స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పరీక్ష సామగ్రి పంపిణీ చేసిన దాతలు

జఫర్‌గఢ్, మార్చి 7 : మండలంలోని హిమ్మత్ నగర్ ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి రాజిరెడ్డి హాజరై 31 మంది విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, ఎరేజర్లు, తదితర పరీక్ష సామగ్రి అందించిన హోప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జనగామ చౌరస్తా, మార్చి 7: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, పట్టణ వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు, కొత్త రేషన్‌కార్డులు, అన్ని రకాల పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి ముందు చూపులేకపోవడంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, ఇర్రి అహల్య, బూడిద గోపి, జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, శేఖర్, ఉపేందర్, అజార్, షబానా పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత


వాటర్ ఫిల్టర్ బహూకరిస్తున్న టీచర్ రమాదేవి

బచ్చన్నపేట, మార్చి 7 : మండల కేంద్రంలోని పాఠశాలకు ఉపాధ్యాయురాలు పింగిళి రమాదేవి శేషారెడ్డి శుక్రవారం రూ.20వేల విలువైన వాటర్ ఫిల్టర్ అందించారు. ఈ మేరకు మండల విద్యాధికారి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలో వారంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వాటర్ ఫిల్టర్ అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. హెచ్ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమాదేవి, జీ శ్రీనివాస్, ఎన్ శ్రీదేవి పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. డీఈవోగా యశ్వంత్, ఎంఈవోగా అజిత్‌రెడ్డి, హెచ్ఎంగా నవ్యశ్రీ వ్యవహరించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 7 : మండలంలోని తాటికొండలో బాధిత కుటుంబానికి మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. బొంకూరి కొమురయ్య అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, బొంకూరి యాదగిరి, మారపాక శ్రీనివాస్, ఎం.ప్రభాకర్, ఎం.యాదయ్య, పాలకుర్తి నాగరాజు, మారపాక మధు, దామెర శ్రీను, రవి, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి, మార్చి 7: పంచాయతీ కార్యదర్శుల మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కడవేరు జ్యోతి, మండల అధ్యక్షుడు ముసిపట్ల భాస్కర్, ఉపాధ్యక్షులుగా గుంటి సందీప్, పొగాకు రమాజ్యోతి, ప్రధాన కార్యదర్శి అవగల్ల కుమారస్వామి, కోశాధికారిగా నీలం కవిత, సభ్యులుగా పుల్లూరి సంతోష్‌కుమార్, ఎల్లంల దీపిక, నర్మెట్ట శ్రీలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

కావలెను
jobs Apply Now!
★ వరంగల్‌లో ఇంట్లో ఉండి పనిచేయుటకు భార్య, భర్తలు కావలెను. జీతం ఇద్దరికి కలిపి 18,000/– + ఉచిత రూమ్, ఉచిత కరెంట్ సంప్రదించండి. సెల్: 9849910111.
NTW-17524

WANTED
★OT-TECHNICIANS (Exp.), PHARMACY (Exp.), LAB-TECHNICIANS (Exp.), DHOBI Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm.
NTW-488

WANTED TEACHERS
★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

CHANGE OF NAME
I, HAFSA KULSUM R/o. H.No.30-2-968, Nehrunagar, Madikonda Village, Kazipet Mandal, Hanumakonda Dist., 506 142, My name Changed from GAJAWELLI SHIRISHA to HAFSA KULSUM for all purposes.

పేరు మార్పు
నా పేరు లిక్కి నాగరాజు, గ్రామం గాంధీనగర్, ఇంటి నెంబర్ 7-179/2, మండలం గోవిందరావుపేట, ములుగు జిల్లా వాసిని. పిన్ కోడ్ : 506347. నా కుమార్తె పేరు ఇంతక ముందు లిక్కి వైష్ణవి అని ఉన్నది. ఈ పేరును లిక్కి ఆశ్రీతగా మార్చబడినది. కుమార్తె వయసు 10 సంవత్సరాలు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565